# “ఇంకానా—ఇకపై సాగవు”

ఊరంతా చిన్నబోయి వుంది.

పొద్దు బారెడెక్కింది.

బావులన్నీ పూజలు లేని దేవాలయాల్లా వున్నాయి.

దొడ్లలోని పశువులు తలలు పైకెత్తి పనుగడ వైపు చూస్తున్నవి. తల్లులతో వేరైన దూడలు కొడారులలో మేస్తున్నవి. నీళ్ళకోసం కాబోలు ఆవులు అంబా అని అరుస్తున్నవి.

కాలువల్లో నీరు ఇంకిపోవడం వల్ల కప్పలన్నీ కాస్త తేమ వున్న చోట గుమిగూడి అరుస్తున్నాయి.

కాలి చల్లారిన కుంపట్లలో కుక్కలు దగ్గరికి ముడుచుకొని పడుకున్నాయి.

కోసిన పొలాల కొయ్య కాళ్ళలో చిక్కిన వడ్లగింజల్ని, హరిజన స్త్రీలు ఊడ్చుకుంటున్నారు.

ఊరి చివర చింతచెట్లు నీడన కూడిన కూలీ నాలీ జనంతో, రంగన్న మాట్లాడుతున్నాడు. నాలుగవ తరగతి వరకు చదివిన ఆరడుగుల మనిషి ఆయన. తమ బ్రతుకు దెరువు కోసం అప్పు డప్పుడు ప్రభుత్వ అధికారులకు దరఖాస్తులు కూడా వ్రాస్తుంటాడు.

భూమిని నమ్మాలంటాడు.

ప్రతివాడూ కష్టించి పని చేయాలంటాడు.

కష్టానికి తగ్గ ఫలితం పొందాలంటాడు.

అలా జరగడం లేదు కాబట్టే ఐదురోజుల నుండి జరిగే రైతు కూలీల సమ్మె సరియైనది, తప్పనిసరి యయిందంటాడు.

* *

దొరవారి గడి ఎత్తుగా, తెల్లగా వుంది – దానిముందే వేపచెట్టు రాక్షసిలా విశాలంగా విస్తరించి వుంది.

దాని మొదట్లో చుట్టూరా సిమెంటు అరుగు పరుచుకొని వుంది.

ఆ అరుగుపై దొర "చంద్రారెడ్డి" పొరచుట్టను పీలుస్తూ, వది లిన పొగలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు. చుట్టూ కూచున్న రైతులు, భూస్వాములు, దొరవారి ఆలోచనాతీరును ఊహిస్తూ, వారి నోటనుండి ఏమొస్తుందోనని, తమ ఆలోచనల్ని ఆపి దొర వైపు చూస్తున్నారు.

ప్రక్కనే వున్న కరణం–

"సీళ్లా – మేతా లేక పశువులు చచ్చేకాల మొచ్చింది" అంటూ దొర వైపు చూశాడు.

తుప్పున ఉమ్మేసి-

"అయినా, ఈ వెదవలకి ఇంత ధైర్యం ఎక్కడిదాంట" అవి చుట్టను దులుపుతూ, చంద్రారెడ్డి దొర కరణం వైపు చూశాడు.

"అదే నేను ఆలోచించేది. మా చిన్న తనంలో ఒక్కపూట చద్దన్నంవేస్తే, దినమంతా పనిచేసేది, ఈ వెధవులు...ఇప్పుడూ... అమ్మో...అమ్మో..."

అంటూ అగ్నికి ఆజ్యం పోస్తున్నాడు కరణం

చంద్రారెడ్డి బుర్రలో సెగలు లేస్తున్నాయి.

కూర్చున్నవారి మనసుల్లో మంటలు లేస్తున్నాయి.

"అసలింతవరకు రావడం ఆలోచించారూ? నేనైతే మొదటి నుండి చెపుతూనే ఉన్నా! రేడియో అంటూ వుంటే ఊళ్లో అది దొరవారి గడీలోనే వుండాలి. దొరవారేమో పంచాయతీ ఆఫీసులో పెట్టించారా! రోజు ఆదేమో" కరణంగారు మాటలు ముగించక ముందే-

"నీ రేడియో లేకుంటే వాళ్ళకు వ్యవహారం తెలియదంటావా పంతులూ! ఆ రంగడు లేడూ వాడు, రోజు ప్రక్కూరికెళ్లి పత్రిక తెచ్చుకుంటాడు. రేడియోలు జనాన్ని చెడగొడ్తున్నాయి.

అదీగాక! రోజుకో మీటింగు పెట్టి ఈ నాయకులు ఇచ్చే ఉపన్యాసాలు, హామీలు ఇవ్వన్నీ ఏమైనా తక్కువా!

"ఇక ఈ జనం గొఱ్ఱెలంటె గొఱ్ఱెలుగదా. ఎటుబడి మనకే వస్తుంది తిప్పలు"

"మనకేం తిప్పలు పంతులు!"

"నాలుగైదు ట్రాక్టర్లుతెస్తే అవ్వే అన్ని పనులు చేస్తయి"

ఇక ఉపన్యాసాలిచ్చిన నాయకులే వచ్చి ఈ వెధవలకు తిండి పెట్టమను!

అయినా "ఉపన్యాసాలకు కడుపునిండితే ఇన్ని కష్టాలు ఎందుకంటా"

వేపచెట్టు ఒక్కసారి ఎండుటాకుల్ని రాల్చింది.

"అయ్యయో! మొన్న రంగడి మాటలు తమరినలేదా! సీలింగొస్తుందని, మన భూములన్నీ పోతాయని, అంతేకాదు ఇకనుండి మీ దొరతనం అసలే వుండదట!"

"దున్నేవాడిదే భూమట!"

ఇంకా ఏమేమో అనబోయిన కరణం వైపు చూసి "ఆపవయ్యా, ఆపు! ఏడిశారు! వాడూ నీవూ ఈ దొరతనం ఎవరన్నా ఇచ్చిందా! వద్దన్నప్పుడు పోవడానికి"

దొరతనం పోతుందన్న మాట దొరవారి వంట్లో కంపరం పుట్టించింది. కళ్ళల్లో నెత్తురు చిమ్మించింది.

ఇక దొరవారికి వారి మధ్యలో కూర్చోబుద్ధి కాలేదు.

"చూద్దాం! లే! ఇంకా ఎన్ని రోజులు చేస్తారట ఈ సమ్మె!"

"ఈ రోజు తప్పకుండా కాళ్ళబేరానికి రాకమానరు" అంటూ దొరవారు లేచి గదిలోకి నడిచారు.

"అన్నట్లు తమరికో విషయం మనవి చేయాలి – వీళ్ళకు బుద్ధి చెప్పే విధానం నాకు బాగా తెలుసు" అంటూ దొరవారిని అనుసరించాడు కరణం.

* *

అయిదు రోజుల నుండి ఎలోగో పూట గడుపుకొస్తున్న ఆడ

వాళ్ళు ఈ రోజు చేటల్ని జారగిలవేసి, చంటిపిల్లలన్ని కొడ్తున్నారు భర్తల్ని తిడుతున్నారు. ఎవరింట్లో కూడ పొగ రావడంలేదు.

చింతల కింద రంగన్న మాటలు ఎవ్వరూ వినడం లేదు.

"కూలీల సంఘం – వర్ధిల్లాలి"

"రంగన్నకు జై"

అన్నవాళ్ళంతా, ఈ రోజు రంగన్నకు ఎదురుతిరుగుతున్నారు.

అయినా రంగన్నలోని ఓపిక మాత్రం నశించలేదు.

అతనికి తెలుసు. దీనికంతా కారణం "ఆకలి" అని

అంతలోనే కరణంగారి వద్దనుండి కబురొచ్చింది.

కాకుల్లా లేచిపోయారు అందరూ– రంగన్న, మరో నలుగురు తప్ప.

పోయినవారి కోసం దొరవారి గరిసే తెర్చుకుంది. కూలీల గుడిసెల్లో ఆ పూట కూడు ఉడికింది.

రకరకాల ఆలోచనల్తో రాత్రి గడిచింది.

* *

మరునాడు ఊళ్ళోకి పోలీసు వ్యానొచ్చింది.

కళ్ళల్లో దుమ్ము చిమ్ముతున్నా, దానివెనకాలే పరుగెత్తుతున్నారు బడి పిల్లలు.

వ్యాను గడిముందు ఆగింది.

పోలీసులు కూలీల ఇండ్లు సోదా చేశారు.

వాళ్ళ ఇళ్ళల్లొ జొన్నలు చూశారు. ఎస్.ఐ. గారు గరిసెను చూశారు. వగిలిన తాళాల్ని, విరిగిన తలుపుల్ని పరిశీలించారు. క్రిందపడ్డ జొన్నల్ని చేతిలోకి తీసుకున్నారు.

గుడిసెల్లోని జొన్నలు – పోలీసుల చేతుల్లో
గరిసెల్లోని జొన్నలు – యస్ ఐ. గారి చేతుల్లో
రెండిటినీ పోల్చి చూశారు.
మచ్చు కలిసింది.
కూల్లోళ్ళకి ఉచ్చు వచ్చింది.
ఊళ్లో చిచ్చులేచింది.

రాత్రి రంగన్న గరిసెను దోచాడు అతని అనుచరులు గుడిసెల్లోకి జొన్నలు మోశారు.

దొరగారి కుక్కలు మొరిగినవి.
గడిముందు గాడిదలు పరుసెత్తినవి.
ఇంకా...ఎన్నో...ఎన్నో...
సాక్ష్యాలూ......సంతకాలు.

అన్నీ చకాచకా జరిగిపోయినవి. పంచనామా ముగిసింది. రంగన్నను, అతని అనుచరుల్ని పోలీసులు వ్యానులోకి ఎక్కించుకోని పోయారు. వాళ్ళ, వాళ్ళ ఆడవాళ్లు ఏడుస్తూ పెట్టే శాపనార్థాలు, తిట్లూ వినలేక దొరవారు, పంతులుగారు గడిలోకి నడిచారు.

బస్తా బియ్యాన్ని, బండిమీద వేసుకుని, ఖాళీస్థలంలో కట్టెలు నింపుకొని, ఓ మేకపోతుని బండికి కట్టుకొని మస్కూరి, పోలీసు వ్యాను పోయిన తోవను అనుసరించాడు. వెనుక నడుస్తున్న మేక పోతు బెదిరి అరుస్తుంది.

పోలీసులు ఊళ్లోకి వచ్చి, ఇంత మందిని పట్టుకుపోవడానకి కారకులు, కరణం - దొరవారన్న సంగతి, బడిపిల్లలు గ్రహించే

సరికి వాళ్ళ ముఖాలలో ఏవేవో ఆలోచన తరంగాలు కదిలినవి. ఒకరికి వొక ఏమేమో చెప్పుకున్నారు చూపుల్లో ఆవేశం కదలికల్లో ఆందోళన కనిపించింది.

ఈ లోపల బండిగంట మ్రోగింది.

కాని వాళ్లు బడి వైపు పోక–

పిడికిళ్లు బిగిస్తూ గడి వైపు నడిచారు.